ఉపాధి కూలీలకు నీడ కరువు

- ప్రభుత్వం నుంచి అందని టార్పాలిన్లు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న కూలీలు

ఉపాధి కూలీలు ఎర్రని ఎండలోనే పనులు చేస్తున్నారు. కాసేపు సేద తీరుదామన్నా పని ప్రదేశంలో నీడ ఉండటం లేదు. ఏ చెట్టు కిందకో పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. వేసవి అలవెన్సులలో భాగంగా పని ప్రదేశంలో నీడ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో కూలీలు ఎండలకు అల్లాడిపోతున్నారు. పని చేసి ఇంటికెళ్లి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు.

కొత్తపల్లి: మండలంలో 12 పంచాయతీలు, 18 మజారా గ్రామాలున్నాయి. వీటిలోనే 9 గిరిజన గూడేలున్నాయి. ఇందులో సుమారు 35 వేలకు పైగా జనాభా ఉంది. 7,300 పైచిలుకు కుటుంబాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో జాబుకార్డులు కలిగి ఉన్నారు. మొత్తం 200 పైన ఉపాధి కూలీల గ్రూపులు ఉన్నాయి. ప్రతి రోజు 3,500 మందికి పనులు కల్పించాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చింది. అయితే అన్ని గ్రామాల్లో రోజు 4,000 మంది కంటే ఎక్కువ సంఖ్యలో ఉపాధి పనులకు హాజరవుతున్నారు. పని ప్రదేశంలో కూలీలు 4 గంటలు పనిచేయాల్సి ఉంది. అసలే ఎండలు మండిపోతున్న తరుణంలో మధ్యలో కాసేపు సేదతీరేందుకు ఎక్కడా నీడ ఉండటం లేదు. నీడ కోసమే ఒక్కో గ్రూపునకు ఒక్కో టార్పాలిన్ పట్ట ఇవ్వాల్సి ఉన్నా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. ప్రభుత్వం నుంచి టార్పాలిన్ పట్టలు అందకపోవడంతో కూలీలు ఎండలకు తట్టుకోలేక చెట్ల నీడను వెతుక్కోవాల్సి వస్తోంది. ఇక గ్రామానికి ఒక్కో మెడికల్ కిట్టు మాత్రమే అందుబాటులో ఉంచుతుండటంతో కూలీలు అస్వస్థతకు గురైన సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పని పూర్తి చేసుకుని ఇళ్లకు వచ్చి స్థానిక ఆర్ఎంపీలనో లేక, మెడికల్ షాపుల్లో మాత్రలో తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారు. నీళ్ల, గడ్డపారా, చలికె పార తదితర పని ముట్లు కూడా సమకూర్చకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేసవి అలవెన్సులు, నీడ కోసం టార్పాలిన్ పట్టలు, తగినన్ని మెడికల్ కిట్లు మంజూరు చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.



బండినాయిని పాలెం సమీపంలో పనిప్రదేశంలో ఎండలోనే కూర్చున్న కూలీలు

ఎండలు మండిపోతున్నాయి



ఎండలు మండిపోతున్నాయి. పనులు చేసే చోట నీడ కూడా ఉండటం లేదు. వడ దెబ్బ భారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పనులు చేసే చోట నీడ ఏర్పాటు చేయాలి.

– మరియమ్మ, గువ్వలకుంట్ల గ్రామం, ఉపాధికూలీ

మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి



ఈ ఏడాది మొదటి నుంచి ఉపాధి పనులు చేస్తున్నాం. ఇంతవరకు పని ప్రదేశంలో నీడకోసం టార్పాలిన్ పట్టలను ఒక్కసారి కూడా ఇవ్వలేదు. దీనికి తోడు పనిప్రదేశంలో ఎవరికైనా ఆరోగ్య సమస్య, ప్రమాదం సంభవిస్తే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు కూడా ఇవ్వలేదు. అధికారులు స్పందించి వాటిని పని ప్రదేశంలో ఉంచాలి.

– మద్దిలేటి, ఎర్రమఠం గ్రామం, ఉపాధి కూలీ

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: చట్టాలపై అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. మంగళవారం జైకిసాన్ పార్కులో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లేబర్ చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోర్టు పారా లీగల్ వలంటీర్లు చిన్నిరాజు, కేజియా పరి, హసన్‌మియా, యోగా మాస్టర్ దస్తగిరి, లింగన్న గౌడు, లోకేష్, న్యాయవాదులు వెంకటరమణ, సోషల్ వర్కర్ శోభరాణి పాల్గొన్నారు.

20న ఆశా వర్కర్ల సమ్మె

బండి ఆత్మకూరు: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ నాయకులు తెలిపారు. మండల పరిధిలోని రెండు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు రత్నమయ్య, రాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులను, శ్రామికులను కట్టు బానిసలుగా మార్చే చట్టాల అమలుకు పూనుకుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. ఆశా కార్యకర్తలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు సువర్ణమ్మ, భాగ్యమ్మ, నాగలక్ష్మమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

- **జూపాడుబంగ్లా:** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పారుమంచాల పీహెచ్‌సీ డాక్టర్ మౌనికకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ణ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న సమ్మె చేయనున్నట్లు చెప్పారు.

రక్తదానం చేయండి



స్టిక్కర్లు విడుదల చేస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ×రక్తదానం చేయండి...ప్రాణ దాతలుగా నిలవండి¥ స్టిక్కర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రాణాలు ఆటో డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రఘురామమూర్తి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, నాగేశ్వరరావు, నాగరాజు, మాలిక్, మధు, శివ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి తులసి

ఆత్మకూరు: పట్టణంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి తులసి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబులు సూచించారు. పట్టణంలోని పలు కాలనీల్లో పక్కా గృహాల నిర్మాణాల లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. పలు ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో త్వరగా పూర్తి చేసుకోవాలని, లేకపోతే బిల్లులు నిలిచిపోతాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న మొత్తంతోపాటు బీసీలకు రూ.50 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు, చెంచు గిరిజనులకు రూ.లక్ష అదనంగా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నాయక్ పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య

శ్రీశైలంప్రాజెక్ట్: పేద విద్యార్థులకు 1 నుంచి 10వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించనున్నట్లు మండల విద్యాధికారి-2 కె.కలీముల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో రూ.1,40,000 ఉన్న వారి పిల్లలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 1వ తరగతిలో చేర్పించేందుకు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.cre.ap.gov.in వెబ్‌సైట్ సెల్. 9182176542 కు సంప్రదించాలన్నారు.

మహానందిలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత

మహానంది: మహానంది మంగళవారం 41 డిగ్రీల ఉష్ణోగ్ర నమోదైనట్లు అధికారులు తెలిపారు. బుక్కాపురంలో 40.86, గాజులపల్లెలో 40.32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. మూడు రోజుల నుంచి మహానంది మండలంలో ఎండ వేడిమి అధికంగా కనిపిస్తోంది. ఉదయం 10 గంటలు దాటితే బయటికి వచ్చేందుకు ప్రజలు భయపడిపోతున్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి డాక్టర్ వేణుగోపాల్

మహానంది: విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకుని లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. మహానంది వ్యవసాయ కళాశాలలో మంగళవారం వ్యవసాయ విద్యార్థులకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. డాకర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఉద్యోగ అవకాశాల కోసం పోటీ పరీక్షల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎల్.వి జయభాస్కర్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, కోచింగ్ నిపుణులు కృష్ణప్రదీప్, భవానీ శంకర్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు భారతి, వరలక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం వేతనాలు పెంచకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే తమను కార్మికులుగా గుర్తించి మెరుగైన వేతనాలు అందించాలన్నారు. పని భారంతో పలు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సెలవులు సైతం లేకపోవడంతో ఆశాకార్యకర్తలు వైద్యుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఆశా కార్యకర్తల సమ్మెకు తరలిరావాలని కోరారు. అనంతరం అర్బన్ వైద్యశాల డాక్టర్ కాజియాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయరాళ్లు వరలక్ష్మి, రమణమ్మ, అపర్ణ, జ్యోతి, శాంతి, నాగలక్ష్మి, సంతోషమ్మ, హసీనా, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కాజియాకు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- డీపీఓ శివారెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ శివారెడ్డి

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డీపీఓ శివారెడ్డి సూచించారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడా చెత్తా చెదారం నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య సిబందితో శుభ్రం చేయించి చూడముచ్చటగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. వచ్చేది వర్షాకాలమని పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. చెత్త నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు పెరిగి డెంగీ, మలేరియా, అతిసారా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో లోతుగా గుంతలు ఉండకుండా చూడాలన్నారు. వీధి దీపాలు వెలిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో పలుచోట్ల దిబ్బలు మురుగుకూపాలుగా ఉన్నాయని, వాటిని తొలగించి సుదూర ప్రాంతాల్లో వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంబాబునాయక్, ఆత్మకూరు, పగిద్యాల ఎంపీడీఓలు నాగభూషణంశెట్టి, సుమిత్రమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి.నాగరాముడు డిమాండ్ చేశారు. యువకులకు ఉద్యోగ, ఉపాధి అంశంపై మంగళవారం సున్నిపెంటలోని జలవనరుల శాఖ అతిథి గృహంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాముడు మాట్లాడుతూ ప్రైవేటు రంగలో రిజర్వేషన్లు లేకుంటే అణగారిన కులాలు మరింత వెనకబడి పోతాయన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని కేంద్రంలోని బీజేపీ, రెండు లక్షల ఉద్యోగాలిస్తామని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోక పోతే ఉద్యమిస్తామన్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్క్‌షాప్‌లో ఏఐవైఎఫ్ మండల నాయకులు మహేష్, మధు, డి.ఇమ్మానియేల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

పగిద్యాల: ఈనెల 20న జరిగే హర్తల్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కిరిసాహెబ్ ఉపాధి కూలీలను కోరారు. మంగళవారం కొత్త ముచ్చుమర్రి గ్రామ పరిధిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి 100 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుచ్చన్న, కురుమన్న, లలితమ్మ, చెంచమ్మ, సువార్తమ్మ, జానకి, సుగుణమ్మ, మహేశ్వరి, భారతమ్మ పాల్గొన్నారు.

వరి గడ్డి దగ్ధం

వెలుగోడు: మండలంలోని బోయరేవుల గ్రామంలో మంగళవారం వరిగడ్డి దగ్ధమైంది. రైతు పొలం నుంచి ట్రాక్టర్‌పై వరిగడ్డిని తీసుకు వస్తుండగా బోయరేవుల గ్రామంలోని సుంకులమ్మ గుడి సమీపంలో వీధి స్తంభాల వైర్లు తాకి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నిప్పురవ్వలు గడ్డికి అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవరు లిఫ్ట్ ఎత్తి గడ్డిని రోడ్డుపై వదిలారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ట్రాక్టరుకు ఎలాంటి నష్టం కలగకపోయినా రూ.4 వేల విలువ చేసే గడ్డి కాలిపోయిందని డ్రైవర్ తెలిపారు.

శనగల బసవన్నకు పూజలు



పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్



హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ తెలిపారు. మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన హామీలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందించారన్నారు. ఇటీవల నియోజకవర్గంలో గాలి, వాన బీభత్సంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూడా కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, 2029లో ఎన్నికలు వచ్చినా, జమిలీ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షులు కోకిల రమణారెడ్డి, సర్పంచు జనార్దన్‌గౌడు, ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, రాజు, విజయకుమార్, శివరామకృష్ణారెడ్డి, అబుబక్కర్, మహబూబ్‌బాషా, శివ, నాని, నాగార్జునరెడ్డి, ఉపేంద్రారెడ్డి, నాగభూషణంరెడ్డి, మల్లయ్య, రమణ, నాగేశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుమంత్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

ధనుంజయ సేవలు మరువలేనివి

ఆత్మకూరు: పేదలకు స్వర్గీయ డాక్టర్ ధనుంజయ చేసిన సేవలు మరువలేనివని ఆత్మకూరు వైద్యులు నాగన్న, గౌరీనాథ్, రాయుడు, గోవిందరాజులు, అజయ్‌కుమార్, సీపీఎం సీనియర్ నాయకులు రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో మంగళవారం స్వర్గీయ ధనుంజయ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతం ఆత్మకూరులో నిరుపేదలకు వైద్యం అందించి ధనుంజయ ప్రజా వైద్యుడిగా పేరుగాంచాడన్నారు. సీపీఎం అభివృద్ధికి కూడా ఎనలేని కృషి చేశాడన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామిగౌడ్, రణధీర్, రజాక్, రాంనాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మాబాషా, శంకర్‌రెడ్డి, రామచంద్రయ్య, కరిముల్లా, రామసుబ్బయ్య, తిరుపాలయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఉత్పత్తులు

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఉత్పత్తులు దిగుబడి చేసుకోవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, ప్రకృతి వ్యవసాయ మాడల్ మేకర్ ట్రైనీ సయ్యద్ బాషా న్నారు. మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వార్షిక ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీపీఏ జహీద్, వెలుగు సీసీ రమణ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

నందికొట్కూరు: ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ హరి గోపాల్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మిడుతూరు మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీని పీడీ పరిశీలించారు. లబ్ధిదారులతో నిర్మాణలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు ఆర్థిక సాయం చేస్తామని, త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ అధికారులు విజయబాబు, నాగరాజు, భాస్కర్, ఎంపీడీఓ దశరధరామయ్య, ఏఈ యోగేష్ ఉన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మంగళవారం పండ్లతోటల పెంపకంపై ఎన్ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా 100 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు చెప్పారు. మామిడి, దానిమ్మ, సపోట, సీతాఫలం, నిమ్మ, జామ, కొబ్బరి, అంజీర, నేరేడు, రేగు ఎకరా నుంచి 5 ఎకరాలు.. మల్లె, గులాబీ పూలతోటలు, మునగ 0.25 నుంచి ఎకరా వరకు నాటుకోవడానికి మొక్కలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలి



తిమ్మాపురం వైద్యాధికారి భగవాన్‌దాస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న వైద్య సిబ్బంది

మహానంది: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు కోరారు. మంగళవారం తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి భగవాన్‌దాస్‌కు ఏఎన్‌ఎంలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు భార్గవి, శ్రీలత, హేమలత మాట్లాడుతూ ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమపై ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. క్షమాపణలు చెప్పకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

- **వెలుగోడు:** ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎంపీహెచ్‌ఈఓలు శ్రీనివాసులు, సుజాత, నాగలక్షమ్మ, సునీత, వెంకటేష్, నాగలక్ష్మమ్మ, ప్రమీలమ్మ, మునీంద్రమ్మ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారి జహీర్‌వలికి వినతిపత్రం అందజేశారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ మురళీకృష్ణ

నందికొట్కూరు: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్ద చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో డీలర్లు, వ్యవసాయాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ డీలర్లు సీడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు నివేదికనలను అందజేయాలన్నారు. విత్తనాలు కొనేటప్పుడు కంపెనీకి సంబంధించిన వాట్సాప్ సరిఫికెట్లు, పెస్టిసైడ్స్ కంపెనీలకు సంబంధించిన పీసీలు, ఫర్టిలైజర్స్ కంపెనీలకు చెందిన ఓ ఫార్ములాను లైసెన్స్‌లో జత చేసుకొని వ్యాపారం చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీఏ విజయశేఖర్, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాములపాడు: మండలంలోని క్రిష్టారావుపేటలో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం టిప్పర్ – బైక్ ఢీకొన్న ప్రమాదంలో పాములపాడుకు చెందిన మండడి లోకేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. రహదారి పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను బైక్ క్రాస్ చేసేక్రమంలో టిప్పర్‌ను డ్రైవర్ ముందుకు నడిపాడు. దీంతో టిప్పర్ బైక్‌కు తగలడంతో లోకేశ్వరరెడ్డి కింద పడ్డాడు. అయినా గమనించకుండా టిప్పర్ డ్రైవర్ ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని టిప్పర్‌ను ముందుకు కదిలించడంతో లోకేశ్వరరెడ్డి కాలు పాదంపై ముందు టైర్ ఎక్కింది. స్థానికులు కేకలు వేస్తూ ముందుకు పరిగెత్తుకు రావడంతో టిప్పర్‌ను ఆపి డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు ఘనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు.

కౌలుకార్డులకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: పొలం కౌలుకు సాగు చేసే రైతులు కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించి కార్డు పొందాలన్నారు.

మట్టి నమూనా పరీక్షల కోసం..

పొలంలో మట్టి పరీక్ష చేయించుకోవాలనుకుంటే రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి రైతులకు సూచించారు. సిబ్బంది రైతు పొలానికి వెళ్లి మట్టినమూనాలు సేకరిస్తారన్నారు. మట్టిని నంద్యాల పరీక్షా కేంద్రానికి పంపి పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై విశాఖపట్నంకు చెందిన కళారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో వినాయకప్రార్థన, శ్రీవఘ్నరాజంభజే, శివపాదమంజీరనాదం, శివ తాండవం, శంభో శివ శంభో, పార్వతీకల్యాణం తదితర గీతాలకు సువర్చల, లక్ష్మీతన్మయి, దీక్షిత, లిక్షిత, స్నేహలత, లక్షయ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.